# వ్యాసుని వ్రాయసకాడు

వ్యాసభట్టారకుడు ఆనందంతో ఒక్కసారిగా ఉబ్బితబ్బిబ్బై పోయినాడు. 'ఈనాటికిగదా నేను చేసిన మహాతపస్సంతా ఫలించింది!' అని లోలోపల ఎంతైనా మురిసిపోయాడు. మళ్ళీ తనకెదురుగా ప్రత్యక్షమైన బ్రహ్మదేవుని చూచి, "నేను కలగంటున్నానా? మేలుకొన్నానా?" అని రెండుమూడు మారులు కన్నులు నులుముకొన్నాడు. తన కెదురుగా ప్రత్యక్షమైనది సాక్షాత్తు ఆ చతుర్ముఖుడే! ఇంక సందేహమేమీ లేదు.

వెంటనే ఆయనకు అర్ఘ్యపాద్యాదులతో షోడశోపచార పూజ చేసి సభక్తికంగా సాష్టాంగ నమస్కారం చేశాడు.

కమలాసనుడు వ్యాసుని భుజాలపై మెల్లిగా తట్టి, "లే నాయనా! నీ సత్సంకల్పం ఫలిస్తుందిలే" అన్నాడు. వ్యాసుడు లేచి బ్రహ్మదేవుని పాదాలకు దగ్గరగా కూర్చున్నాడు.

అయినా, వ్యాసునికి సంతృప్తి కలగలేదు. తన లోలోపలి మనోరథాలన్నీ బ్రహ్మదేవుని కిలా నివేదించుకొన్నాడు:

"చరాచర ప్రపంచానికంతటికీ సృష్టికర్తలైన తమరు సకలప్రాణికోటి మనోభావాలున్నూ కరతలామలకాలే గదా! ఐనా అజ్ఞానచాపల్యం వల్ల ఏదో విన్నవించుకొంటున్నాను. నా అపరాధం క్షమించాలి!...

"నా వంశీయులైన భారతవీరుల మహత్తర గాథ స్మరించినప్పుడు నాలో అపారమైన కరుణ, భరింపరాని వేదన, దృఢమైన ధర్మపరిరక్షణ శ్రద్ధ మొదలైన ఎన్నో భావాలుద్భవించి తలమునకలౌతుంటాయి. ధర్మసంగ్రహాధారమైన ఆ గాథ యావత్తూ భారతేతిహాసంగా రచించవలెననే సంకల్పం కలిగి, అది నా తీవ్ర తపశ్చర్య కనేకవిధాలుగా అంతరాయం కలిగిస్తున్నది. ఈవిధమైనటువంటి అంతరాయం ఎన్నడున్నూ నేను కన్నది

గాదు విన్నదీకాదు. ఏమిచేయడానికిన్నీ పాలుపోదు. ఈ అంతరాయ రహస్యం అవగాహన చేసుకుందామనే జిజ్ఞాసతోనే—”

దీనికి చతుర్ముఖుడొక్క చిరునవ్వు నవ్వి—

“నాయనా! ఈ నీ ఇతిహాసనిర్మాణం నీ తపశ్చర్య కెంతమాత్రమూ అంతరాయం కానేరదు” అన్నాడు.

వ్యాసుడు ఆశ్చర్యం పట్టలేక ఆయనవైపదేవిధంగా తిలకించాడు.

“మహర్షీ! ఈ ఇతిహాసరచన నీవు చేసే తపశ్చర్యకన్నా మహత్తరమైన తపశ్చర్యసుమా” అన్నాడు సృష్టికర్త తిరిగి ఇంకొకమారు.

సాత్యవతేయుడాయనమాటలకు క్షణకాలం నిశ్చేష్టుడైపోయాడు. వెంటనే వ్యాసుని పెదవులపై చిరునవ్వులు చిందులు దొక్కాయి.

“అవును! నా జ్ఞాననేత్రం వికసిస్తున్నది. నేను తెలియక ఏమేమో ప్రలాపించాను. మన్నించవలసింది” అన్నాడు.

పిమ్మట అతడు కనురెప్ప వేయకుండా బ్రహ్మదేవుని ఫాలభాగంపై తనదృష్టి నిలిపి తిరిగి ఇలాగ నివేదించాడు.

“ఈ మహాభారత గాథ చాలావరకు నా చర్మచక్షువులకు ప్రత్యక్షంగానే జరిగింది. అయితే అప్రత్యక్షంగా జరిగినటువంటి కొన్ని సంఘటనలు అజ్ఞేయములైన ఆయా భారతవీరవరేణ్యుల మనోవృత్తులు కొన్ని కొన్ని నాకింకా దృశ్యాదృశ్యంగానే ఉండిపోతున్నాయి. అవి అవగాహన కానిదే నా ఇతిహాస నిర్మాణ సంకల్పం నెరవేరదు. స్వయముగా మానవుల మనోవృత్తు లుద్భవింపజేసి, జగద్రూపక సూత్రధారులైన మీ అపార కరుణాకటాక్షం కించిత్తు నామీద ప్రసరిస్తే తప్ప నా సంకల్పం సాకల్యంగా నెరవేరదేమోననే సంశయం నన్ను వేయివిధాల వేధిస్తున్నది”—అని మహర్షి ఇంకా ఏమేమో చెప్పబోయాడు. కమలాసను డతని మాటలకు అడ్డువచ్చి ఇలాగ ప్రత్యుత్తరం ఇచ్చాడు.

“సాత్యవతేయా! సంకీర్ణములై వున్న చతుర్వేదాలనున్నూ స్వయంగా విభజించి, లోకానికి వేదజ్యోతి ప్రసాదించి, వేదవ్యాసుడనే ప్రతిష్ఠ పొందినవాడవుగదా! ఎందుకయ్యా నీకింత బేలతనము! స్వయంగా నీవనేక విషయాలు తెలిసివుండిన్నీ, పెద్దలయెడల వినయము కనబరచవలెననే భావంతోనే ఈ విధంగా వేడుకుంటున్నావు! అయినా భారతసంహిత

కల్పనా సమయంలో నాకు గూడా అజ్ఞేయంగా ఉండిపోయినటువంటి అనేకమైన జీవరహస్యాలు నీకళ్ళ ఎదుటనే ప్రత్యక్షం కాగలవు! తిరిగీ ఆ భారతగాథ యావత్తూ నీ విజ్ఞాన నేత్రం ఎదుట ఇంకొకసారి జరిగిపోతున్నట్టుగానే—వర్తమాన రూపంలోనే—అనుభూతం కాగలదు! లే! భారత సంహితా రచన కుపక్రమించు మహాకవీ!"

ఉరుములు ఉరిమినట్లు వినబడిన సృష్టికర్త వాక్యాలకు వేదవ్యాసుడు విస్మితుడై అలాగే తదేక దృష్టితో ఆయనకేసి తిలకిస్తూ ఉండిపోయాడు. సాత్యవతేయుని ముఖంలో సందేహచ్ఛాయ ఇంకా అలాగే చూచాయగా పొడగట్టింది.

చతుర్ముఖుడతనికేసి, "ఏమిటీ నాయనా! ఇంకా నీ సందేహం!" అన్నట్టు చూశాడు. వేదవ్యాసుడు కొంచెం సందేహిస్తూ తన మనోభావం ఈ విధంగా తెలుపుడు చేసుకొన్నాడు.

"నేను ఏమని విన్నవించుకొన్నా ఏదో విధంగా తమ యెడల అపచారం చేస్తున్నట్లే భాసిస్తున్నది. మరి తమ కింక ఏమని విన్నపం చేయగలను?"

పద్మగర్భుడొక్కసారి పకాలున నవ్వి, ఎంతో ఆప్యాయంగా ఆతన్ని దగ్గరికి తీసుకొని, "నీ లోకజ్ఞత పరిశీలించిన కొద్దీ నా కెంతో ముచ్చట కలుగుతున్నది...... ఈ ఉపచార వాక్యాల కేమిగాని సంగ్రహంగా నీ సందేహం తెలియజెయ్యవయ్యా!" అన్నాడు.

మహర్షి మళ్ళీ తన ఫాలంమీద రెండు చేతులు కమలముకుళంలా జోడించి, అంజలి ఘటించి మెల్లిగా ఇలాగ విన్నవించుకున్నాడు:

"భారత సంహితవిషయం స్మరించేసరికి హృదయం పొంగి పరవళ్లు తొక్కుతున్నది. ఎన్నెన్ని చిత్ర విచిత్ర ఘట్టాలు! ఎన్నెన్ని రోమహర్షణ సంఘర్షణలు! అవన్నీ శ్లోక వాహినులై, వెల్లువలై నా హృదయంలో ప్రవహిస్తున్నవి. విద్యుద్వేగంతో నా భావనాలోకంలో ఆవిర్భవించే ఆ శ్లోకాలన్నీ తిరిగీ ఇట్టే విస్మృతి కుహరంలోనికి వెళ్లిపోతున్నవి. ఆ శ్లోకాలన్నీ శీఘ్రంగా లిఖించే దివ్యలేఖకు లెవరైనా లభిస్తే బాగుండునే అనుకుంటున్నాను—పోనీ వైశంపాయునికిగానీ, పైలునికీ

గానీ, మిగిలిన శిష్యులెవరుగానీ అవి చెబుతామా అంటే—వారింకా దర్భకర్రలు కూడా తిన్నగా తుంచలేని పసివాళ్ళే కదా! ఈ విధమైన డోలాందోళనతో నా మనస్సు బొత్తిగా వశం తప్పిపోతున్నది. తత్రాపి జరాభారం కూడా కొంచెం మితిమీరుతున్నదన్న భయం బాధిస్తున్నది!"

"మహా గణాధిపతిని ధ్యానించుకో! ఆయన సర్వవిఘ్న నిహంత! సమస్త సందేహాలూ, అంతరాయాలూ ఆయన దర్శనమాత్రం చేతనే నివృత్తి అయిపోగలవు! నీ సత్సంకల్పం సాక్షాత్తు సరస్వతీ సంకల్పమే అన్న విషయం విస్మరించకు. నాయనా! నీవు కేవలం నిమిత్త మాత్రుడవే సుమా!"

అని అభయం ఇస్తూనే కమలాసనుడక్కడనే అంతర్హితుడైనాడు.

మహర్షి మరునాడు ప్రాతఃకాలవేళ భాగీరథీ తీరాన నిశ్చలంగా గణాధిపతిని ధ్యానిస్తూ ప్రశాంత భావం వహించాడు.

హిమవత్పర్వత సమీపంలో—ఆ మహర్షి ఆశ్రమంలో ఉన్న అంతేవాసులంతా ఆయన ధ్యాననిష్ఠ చూసి విస్తుపోయి రెప్పపాటు లేకుండా నిలబడిపోయారు; శీతకాలం లేతలేత సూర్యకిరణాల కాంతిలో గంగానది ఇసుక తిన్నె అంతా ఒక బంగారు తిన్నెలా తళతళ మెరిసింది. పక్కనే నదిలో ప్రతిఫలిస్తున్న తెల్లని రెల్లుపువ్వులు కూడా ఆ ఎర్ర ఎర్రని వెలుగుల్లో ఆహితాగ్ని హోమ జ్వాలల్లా వెలిగాయి. మహర్షి తలపై పెనవేసుకున్న జడలేవో, ఆ అరుణ కిరణాలేవో తిన్నగా తెలియడం లేదు! ఆయన ధరించిన కృష్ణమృగ చర్మంపై నల్లనల్లని చుక్కలు మాత్రమే ఆ పైడి వెలుగుల్లో కొంచెం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రశాంత వేళలో పిల్లగాలులు కూడా అలసి సొలసిపోయిన తరంగాల మీద తలలు వాలుస్తున్నట్లుగా మందగించిపోయాయి. ఇంతవరకూ నదీ తీరంలో కెరటాలలో ఉయ్యాలలూగుతున్న హంస మిథునాలు కూడా తమ రెక్కల్లో పండుపగడాల ముక్కులు దాచుకొని, పరమ హంసల్లా

ధ్యానముద్రలో మునిగిపోయాయి. అవి అన్నీ ఆ మహర్షి ఎదట వెయ్యి రేకుల తామర పువ్వుల్లా తేలాయి.

ఇంతలో వ్యాసమహర్షి శరీరం అంతా ఒక్కసారిగా గగుర్పొడిచింది. ఆనంద బాష్పాలు రెండు కళ్లల్లోనూ నిండిపోయి చెంపల మీద జలజలా రాలాయి. ఆతని కెదురుగా విఘ్నేశ్వరుడు పన్నెండేండ్ల బాల కుమారుడులా ప్రత్యక్షమైనాడు!

పార్వతీదేవికి ఆడపిల్లలు లేక పోవడంవల్ల వినాయకుణ్ణి ఒక బాలికలా అలంకరించిందో ఏమో! గణేశ్వరుని రెండు చెవుల చివర రెండు ఎర్రతామర పువ్వులు జూకాల్లా వేలాడుతున్నాయి! అసలే చిన్నవిగా ఉన్న ఏనుగ కళ్ళకు నల్లని కాటుక పెట్టడంవల్ల అవి కొంచెం విశాలంగా కనిపిస్తున్నాయి. కంఠంలో చిరుబొజ్జదాకా వేలాడే ముత్యాల హారాలు. కాళ్ళకు బంగారు గజ్జెలు. నుదుటిమీద చిన్న చంద్రవంక!

ఈ విధంగా ఎదురుగా సుఖాసీనుడై ప్రత్యక్షమైన బాలగణేశ్వరుని చూచేసరికి వ్యాసుని మనస్సు బాగా కుదుటపడింది. ఆ సమయంలో ఆ ఇసుక తిన్నెలో పూజా ద్రవ్యాలు లభించక పోవడంవల్ల మహర్షి వేద మంత్రాలతోనే సంగ్రహంగా శివకుమారునికి పూజచేసి తన మనోరథం సవినయంగా విన్నవించుకొన్నాడు.

"భారత మహాసముద్రం తరించడానికి దేవరవారి లేఖిని నాకొక చిన్న నౌక!" అన్నాడు.

విఘ్నేశ్వరుడు మహర్షి కేసి క్షణకాలం నిశిత వీక్షణం ప్రసరింపజేసి, గంభీరంగా ఇలాగన్నాడు: "అయితే – నా లేఖిని నిరంతరాయంగా సాగిపోవలెను. అది నిలిచిన ఉత్తర క్షణంలోనే దానితోబాటు— నా సాహాయ్యమున్న నిలిచిపోగలదు!" అన్నాడు.

మొట్టమొదట పసిబాలకునిలా ప్రత్యక్షమైన పార్వతీ కుమారుని సందర్శించగానే వ్యాసుడు కొండంత ధైర్యంపొంది ఈయన నాలుగు చేతులకూ పూర్తిగా పని కల్పించవచ్చునని ఎంతో ఉత్సాహపడ్డాడు.

కాని వినాయకుని మాటలు విసేసరికి ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిలిచిపోయాయి.

కొంచెం సేపాలోచించుకొని "అయితే ఒక్క చిన్న మనవి. తను కనవసరంగా కాలహరణం కానీయనుగాని, నా శ్లోక పరంపర పరమార్థం పూర్తిగా ఆకళించుకోకుండా తను రవి లిఖించడం మాత్రం న్యాయం కాదు!" అన్నాడు.

విఘ్నేశ్వరుడు మళ్ళీ క్రీగంటితో మహర్షి కళ్ళలో లోతులు గ్రహించుకొని, "అవునవును! న్యాయం కాదు!" అన్నట్టు చిరునవ్వులు చిందింప జేశాడు.

మరునాటి ప్రభాత వేళ భారత సంహిత రచన ప్రారంభం అయింది. వ్యాస శిష్యులు సేకరించగలిగినన్ని తాళ పత్రాలు సంపాదించి గుట్టలు పోశారు. మహర్షి ముఖతః వేలాది శ్లోకాలు శరపరంపరల్లా వెలువడుతున్నాయి. పక్కనే సమాసీనులైన మహర్షులు, శిష్యులు, జపతపాలు విడిచివేసి ఆ అద్భుతం చూచి తన్మయులై పోతున్నారు.

ఇంతలో విఘ్నేశ్వరుని చేతిలో బంగారు గంటం గమనం మందగించింది. వ్యాసునికి ముచ్చెమటలు పోశాయి. గంటం నడక ఇంకా మందగించింది. గణాధిపతి "ఏం మహర్షీ! నీ శపథం ఏమైంది?" అన్నట్టు అతనికేసి చూచి చిరునవ్వు నవ్వాడు. శిష్యులంతా దిగాలుపడిపోయారు.

మహర్షి భావనలో ఒక ఊహ మెరుపులా మెరిసింది. వెంటనే బ్రహ్మాభేద్యమైన పది శ్లోకాలొక్క గుక్కలో ఏకరువు పెట్టాడు.

మొట్టమొదట, విజ్ఞానం అంతా మూర్తీభవించిన వినాయకునికి కూడా అవి కొరుకుడు బడలేదు! అయినా అవి జాగ్రత్తగా అవగాహన చేసుకొంటూ కొంచెం నెమ్మదిగా వ్రాశాడు. ఇంతలో వ్యాసుడు మరొక పదివేల శ్లోకాలు మనస్సులోనే రచించుకొని ఏమీ ఎరగనట్టులాగే ఆ దివ్య లేఖకుని గంటంకేసి చూస్తున్నాడు.

ఇలాగే మధ్య మధ్య మణుగుల్లాంటి ఘట్టాల సాహాయ్యంతో వ్యాసుడు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకుంటున్నాడు.

విఘ్నేశ్వరుడా మహర్షి అతిలోక ప్రజ్ఞకు తల పంకించి మందహాసం చేస్తూ—

"మహర్షీ! నా అంతటి వ్రాయసకాని లేఖినికి కూడా నీ ఆర్షబలంవల్ల, నీ ప్రజ్ఞవల్ల అంతరాయం కలిగించావే! సాధు! సాధు!" అన్నాడు.

వ్యాసుడు సవినయంగా తన రెండు చేతులూ జోడించి, తలవంచి "ఎంతమాట! దేవరవా రంతరాయం కలిగించకపోవడంవల్లనేగదా, నా ప్రజ్ఞాబలం పని జేసేది!" అన్నాడు.

వినాయకుడు గంటం నిలిపి, సగౌరవంగా వ్యాసునికేసి చూసి—

"భళారా! ఎంతటి మాటకారివయ్యా! మహాకవీ!" అని మెల్లిగా బొజ్జ నిమురుకుంటూ ఒక్కసారిగా కల కల నవ్వాడు!

చుట్టూరా ఉన్న ఋషిగణం ఆనంద కోలాహలం మిన్నుముట్టింది!